యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాంధ్ర మాక్ డ్రిల్‌లో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్



యోగా కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు

- అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్
- ఉత్సాహంగా యోగాంధ్ర మాక్ డ్రిల్

రాజమహేంద్రవరం సిటీ: శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వానికి యోగా తోడ్పడుతుందని నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. లాలాచెరువు సూర్యనమస్కారాల పార్కు వద్ద శుక్రవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'యోగాంధ్ర మాక్ డ్రిల్' నిర్వహించారు. దాదాపు 6 వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ ఒత్తిడి లేని సంతృప్తికరమైన జీవితానికి యోగానే మార్గమన్నారు. శనివారం నిర్వహించే యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర ప్రజల భాగస్వామ్యంతో నెల రోజులుగా యోగాంధ్రపై అనేక శిక్షణ కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సెక్రటరీ జి.శైలజావల్లి, ఎస్ఈ (ఇంజినీరింగ్) ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సీఎంఎం రామలక్ష్మి, ఈఈ మాధవి తదితరులు పాల్గొన్నారు.

అలవాటుగా మార్చుకోవాలి

సీటీఆర్ఐ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం నగరంలోని 14 ప్రాంతాల్లో వివిధ శాఖల ఆధ్వర్యంలో యోగా సాధన నిర్వహించారు. దీనిలో భాగంగా గౌతమీ ఘాట్ దగ్గర డాక్టర్స్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ హోమియో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కేవీవీఎస్ సత్యకుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 5,500కు పైగా ప్రాంతాలలో 8.51 లక్షల మందికి పైగా ప్రజలను దీనిలో భాగస్వాములు చేయడం జరుగుతోందన్నారు. డాక్టర్లు సైతం నయం చేయలేని కొన్ని మొండి జబ్బులను యోగా సాధనతో తగ్గించుకోవచ్చన్నారు. క్రమం తప్పకుండా యోగా చేస్తుంటే శరీరంలో అనేక అద్భుత మార్పులు వస్తాయన్నారు.



సత్యదేవ నర్సరీలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర మొక్కల కూర్పు

మొక్కల కూర్పు

కడియం: కడియపులంకలోని పుల్లా చంటియ్యకు చెందిన సత్యదేవ నర్సరీలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర మొక్కల కూర్పును శుక్రవారం ఏర్పాటు చేశారు. దీనికోసం సుమారు 15 వేల మొక్కలను వినియోగించినట్టు నర్సరీ అధినేత పుల్లా పెద సత్యనారాయణ తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

కంబాలచెరువు: అంతర్జాతీయ యోగా దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు తెలిపారు. స్థానిక బైపాస్ రోడ్డులోని డీఎంహెచ్ స్కూల్లో జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు జరిగే యోగా దినోత్సవంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొంటారన్నారు. డీఎంహెచ్ స్కూల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రవికుమార్, సీఆర్ఎంటీ జయంతి శాస్త్రి, వ్యాయామ ఉపాధ్యాయుడు సునీల్ కుమార్, ఉపాధ్యాయులు లావేటి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ అవసరం

కడియం: ప్రతి ఒక్కరికి యోగా అవసరమని యోగా గురువు, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు కోడూరి లక్ష్మీనారాయణ అన్నారు. కడియంలోని మినర్వా పబ్లిక్ స్కూల్ ఆవరణలో యోగా శిక్షణ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బొర్సు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో యోగా ప్రాధాన్యత, యోగాసనాలపై అవగాహన కల్పించారు. అనంతరం యోగా గురువు లక్ష్మీనారాయణను ఘనంగా సత్కరించారు.

కుటుంబ సభ్యులతో కలిసి కార్మికుల నిరసన

రాజమహేంద్రవరం సిటీ: కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.ఏసుబాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి బుంగ ఏసయ్య రాజు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ యూనియన్ ఆధ్వర్యంలో తలపెట్టిన నిరవధిక నిరసనలో భాగంగా శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట కుటుంబ సభ్యులకు కలసి కార్మికులు నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోటాని ముకుందరావు, నగర అధ్యక్షుడు సిరికి ప్రసాద్, సెక్రటరీ బాల భవాని కుమార్, ఉపాధ్యక్షుడు మందనక్క సాయి, కోశాధికారి బొక్క శ్రీనివాస్ గణేష్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

భవిత కేంద్రం సందర్శన

కంబాలచెరువు: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న భవిత కేంద్రాలు దివ్యాంగులకు ప్రత్యేక శ్రద్ధతో సేవలు అందిస్తున్నాయని రాష్ట్ర సహిత విద్య రాష్ట్ర పరిశీలకులు అబ్దుల్ ఘని అన్నారు. తాడితోటలోని భవిత ఉపకేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందజేస్తున్న వివిధ సౌకర్యాలను, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. భవిత కేంద్రంలో ఐఈఆర్టీ టీచర్ల సేవలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య కో ఆర్డినేటర్ ఎస్.కనకబాబు, ఐఆర్టీ టీచర్ చిట్టి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు రేపు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వెంకటేశ్వర జనరల్ మార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్, శ్యామల నగర్, గాంధీపురం, పాత సోమలమ్మ ఆలయం రోడ్డు, రహ్మత్ నగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

క్లుప్తంగా

కుట్టు శిక్షణతో ఆర్థిక అభివృద్ధి



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: మహిళలు చేతివృత్తులు నేర్చుకోవడం ద్వారా ఆర్థికంగా బలపడవచ్చని స్వర్ణాంధ్ర సేవా సంస్థ ముఖ్య నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర నైపుణ్య శిక్షణ కేంద్రం హాలులో శుక్రవారం జరిగిన 78వ బ్యాచ్ కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళల స్వయం ఉపాధి కోసం స్వర్ణాంధ్ర సేవా సంస్థ తరపున శిక్షణ ఇవ్వడంతో పాటు మెటీరియల్ కూడా అందిస్తున్నామన్నారు. శిక్షణ అనంతరం ఒంటరి మహిళలకు, ఆర్థికంగా బలహీనంగా ఉన్న వారికి ఇప్పటివరకు సుమారు 500 కుట్టుమెషీన్లు బహూకరించామన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి వీజీవీ లక్ష్మి, శిక్షణ టీచర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఏపాత బొమ్మూరులోని ఫెయిత్ ఫెలోషిప్ చర్చిలో సౌండ్ సిస్టమ్, కానుకల పెట్టెను దొంగలు చోరీ చేశారు. దీనిపై చర్చి పాస్టర్ రెడ్డి సూర్యనారాయణ శుక్రవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ రామచంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆహారం, వస్త్రాల వితరణ

కడియం: మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని చైతన్య నగర్ కుష్టువ్యాధి నివారణా కాలనీలోని పేదలకు శుక్రవారం ఆహారం, వస్త్రాలను పంపిణీ చేశారు. రాజమహేంద్రవరంలో నర్సుగా సేవలందిస్తున్న దేవరపల్లి సుజనీ స్వాతి పుట్టినరోజును పురస్కరించుకుని ఈ వితరణ జరిపారు. కార్యక్రమంలో థియేడర్ పాల్, షమ్మీ, పాస్టర్ విక్టర్‌పాల్, రత్నరాజు, సరోజినీ, హితేషా, అనిరుథ్ కుమార్ పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: 28 ఇయర్స్ లేటర్
సూర్యమినీ	: 8 వసంతాలు
సూర్యప్యాలెస్	: సితారే జమీన్ పర్
స్వామి	: కుబేర
అనుశ్రీ	: కుబేర
శివజ్యోతి	: కుబేర
ఊర్వశి	: భైరవం
మేనక	: సింగిల్
రంభ	: హౌటు ట్రయిన్ యువర్ డ్రాగన్
అప్సర	: సితారే జమీన్ పర్
అశోక	: 8 వసంతాలు
నామవరం	
వీఎస్ మహల్	: కుబేర
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: కుబేర
కడియం	
వెంకటసూర్య	: కుబేర

చికిత్స పొందుతూ మహిళ మృతి

రాజానగరం: జాతీయ రహదారిపై తూర్పుగానుగూడెం వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ శుక్రవారం మృతి చెందిందని స్థానిక ఎస్సై నాగార్జున తెలిపారు. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారికి చెందిన దేవరకొండ సూర్యారావు తన భార్య గంగాభవానితో కలసి మోటారు సైకిల్‌పై రాజమహేంద్రవరం వెళ్లి వస్తుండగా గురువారం రాత్రి ప్రమాదానికి గురయ్యారు. బైకు వెనుక భాగంలో తగలించిన బ్యాగ్ ఒకటి వెనుక నుంచి వస్తున్న వాహనానికి తగులకోవడంతో రోడ్డుపై పల్టీ కొట్టారు. ఈ సంఘటనలో గంగాభవానీ తలకు బలమైన గాయం కావడంతో ఆమెను చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. సూర్యారావుకు స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదానికి కారణమైన వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

రంగంపేట: పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా చేపట్టాలని ఐటీసీ స్కూల్ కో ఆర్డినేటర్ పి.దుర్గబాబు పిలుపు నిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వావ్ ప్రోగ్రాంలో భాగంగా నిర్వహించిన ఇంటర్ స్కూల్ రీసైక్లింగ్ చాంపియన్‌షిప్‌నకు సంబంధించి పాత పుస్తకాలు, పాత పేపర్లు అందిస్తే దానికి తగిన విద్యాసామగ్రి అందిస్తామన్నారు. ఒక పేపర్‌ను తొమ్మిది సార్లు రీసైక్లింగ్ చేస్తామని, దీని ద్వారా చెట్లను కాపాడుకోవచ్చన్నారు. ఒక టన్ను పేపరు తయారు కావాలంటే 17 చెట్లు అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ రీసైక్లింగ్‌కు సహకరిస్తే మన వంతుగా చెట్లను కాపాడుకోవచ్చునన్నారు. ఈజీఎస్ కో ఆర్డినేటర్ ఎస్.రాముడు ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా చండీహోమం

రంగంపేట: వడిశలేరులో ఏడీబీ రోడ్డు పక్కన కొలువైన విజయ దుర్గాంబిక ఆలయ రెండో వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఆలయ వద్ద మహా చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుడు రేగుడమిల్లి రామ్‌దేశ్‌శర్మ మాట్లాడుతూ లోక కళ్యాణార్థం, గ్రామ శ్రేయస్సు కోసం మహాచండీహోమం నిర్వహించినట్టు తెలిపారు. స్థానిక పెద్దలు ఏలూరి బుల్లబ్బాయి, అనంతలక్ష్మి దంపతుల ద్వితీయ కుమారుడు రవీంద్ర సతీష్, శ్రీదేవిలతో మహా చండీహోమం, అమ్మవారి మూల విగ్రహానికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేక పూజలను ఆయన చేయించారు.

నేడు తాగునీటి సరఫరా వేళలో మార్పు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో శనివారం తాగునీటి సరఫరా సమయంలో మార్పు జరుగుతుందని ఎస్ఈ(ఇంజినీరింగ్) ఎంసీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. సాధారణంగా ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల మధ్య నీరు అందిస్తున్నామన్నారు. అయితే మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.30 నుంచి 9.30 గంటల మధ్యలో నీటి సరఫరా జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని నగర ప్రజలు గమనించాలని కోరారు.

జేగురుపాడు పంచాయతీకి అనుకూలంగా తీర్పు

కడియం: జేగురుపాడు పంచాయతీకి అనుకూలంగా వినియోగదారుల ఫోరం తీర్పునిచ్చిందని పంచాయతీ కార్యదర్శి ఐ.శ్రీనివాస్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. 2023 సెప్టెంబర్ 9న పంచాయతీ తాగునీటి ట్యాంకర్ ప్రమాదశాత్తూ తిరగబడి పాక్షికంగా దెబ్బతింది. ఆ ట్రాక్టర్‌కు చోళ మండలం ఎంఎస్ జనరల్ బీమా కంపెనీ పాలసీ తీసుకున్నారు. ప్రమాద సమయానికి అది ఫోర్సులోనే ఉందన్నారు. అన్ని వివరాలు ఇన్సూరెన్స్ కంపెనీకి అందించినప్పటికీ క్లెయిమ్ చేసేందుకు వారు నిరాకరించారు. దీంతో అప్పటి పంచాయతీ కార్యదర్శి బి.శిరీష 6.2.2024న వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. వినియోగదారుల సభ్యులు ఆర్.శ్రీనివాసరాజు శుక్రవారం ఈ మేరకు విచారణ చేసి, తీర్పు వెలువరించారు. ట్రాక్టర్ మరమ్మతులకు అయ్యే రూ.81,788తో పాటు, ఖర్చుల కింద రూ.20 వేలను 45 రోజుల్లోపుగా చెల్లించాలని, లేకపోతే 12 శాతం వడ్డీతో కట్టాలని ఆ బీమా కంపెనీకి ఆదేశించారు.

ఎన్ఎస్‌యూఐలో విద్యార్థుల చేరిక

రాజమహేంద్రవరం సిటీ: రాజకీయాల్లో ఉత్తమంగా ఎదగాలంటే విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. డీసీసీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు ఆ పార్టీ అనుబంధ విభాగమైన ఎన్ఎస్‌యూఐలో చేరారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్డర్ బాబీ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ఎన్ఎస్‌యూఐ తరపున పోరాటం చేస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ముప్పిడి గోవింద్, రాజమహేంద్రవరం రూరల్ అధ్యక్షుడిగా సమర్థ కుర్తి నాగ దుర్గారావు, రాజానగరానికి వి.సత్య సాయి నియమితులయ్యారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం



విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సత్కరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు



రెవెన్యూ సిబ్బందిని సత్కరిస్తున్న బాపిరాజు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత తహసీల్దార్ కేవీ సూర్యనారాయణ, విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ నారాయణరావు, విశ్రాంత సర్వేయర్ వేణుగోపాలరావు, విశ్రాంత వీఆర్వో మూర్తి, వాచ్‌మన్ సుబ్బారావులను తహసీల్దార్ బి.శ్రీనివాస్ పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైతన్య, సర్వే డిప్యూటీ తహసీల్దార్ సుహాసిని, ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ భువనేశ్వర కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజలకు వారధి

సీటీఆర్ఐ: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా రెవెన్యూ శాఖ పనిచేస్తుందని జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, డిప్యూటీ తహసీల్దార్ జి.బాపిరాజు అన్నారు. స్థానిక రెవెన్యూ భవనలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో సెక్రటరీ కాంతి ప్రసాద్, ట్రెజరర్ శ్రీనివాసరావు, కొవ్వూరు డివిజన్ అధ్యక్షుడు రవి విక్రమ్, కలెక్టరేట్ పరిపాలనాధికారి మక్బూద్ అలీ, గ్రామ రెవెన్యూ అధికారుల జిల్లా అధ్యక్షులు సానా శ్రీనివాస్ పాల్గొన్నారు.